# కాశ్మీర్ | నీడతో యుద్ధం పనికిరాదు

**కేంద్ర** హోంమంత్రి అమిత్‌షా 2019 జూన్ చివరి వారంలో కాశ్మీర్‌లో 2 రోజులపాటు పర్యటించారు. దీనికి కొనసాగింపుగా కాశ్మీర్‌కు ప్రత్యేక రాజకీయ హోదాను ఆయన ముందుకు తీసుకువచ్చారు.

ఒక ఆసక్తికరమైన చర్చ పార్లమెంటులో చోటు చేసుకుంది. అమిత్‌షా, ఇతర బిజెపి నాయకులు జవహర్‌లాల్ కాంగ్రెసుపార్టీ తప్పిదం ఫలితంగానే కాశ్మీర్ సమస్య ఉత్పన్నం అయిందని ఆరోపించారు. అసమర్ధపు రాజీధోరణితో సమస్యను మరింత సంక్లిష్టమయం చేశారని వారన్నారు. ఏవిధమైన షరతులేని కాశ్మీర్‌కు దేశ సమగ్రతలో ఏవిధమైన షరతులు లేని కాశ్మీర్‌కు తామే నిలకడైన, నిజమైన హీరోలమని బిజెపి జబ్బలు చరచుకుంటోంది. గులాంనబీ ఆజాద్ వంటి సీనియర్ కాంగ్రెసు నాయకులు కాశ్మీర్‌లో నెహ్రూ, కాంగ్రెసుపార్టీ విధానాలను, చర్యలను పూర్తిగా సమర్థించారు. వారి సమర్థన ఈ విధంగా వుంది. ఎన్ని అసమానతలున్నప్పటికీ కాశ్మీర్‌ను దేశ సమగ్రతలో అంతర్భాగం చేయటానికి కాంగ్రెసు, దాని నాయకత్వం అనేక చర్యలు చేపట్టి విజయం సాధించారు. బిజెపి చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం, హేతు రహితం, వాస్తవాలకు విరుద్ధం అని కాంగ్రెసు నాయకులు అంటున్నారు.

గత 70 సంవత్సరాలలో ఎక్కువ కాలం కాంగ్రెసుపార్టీ అధికారంలో వున్నదనేది అందరూ ఎరిగినదే. 1948లో నెహ్రూ ప్రభుత్వం భారత్‌లో కాశ్మీర్ విలీన అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. దీనితో కాశ్మీర్ ప్రజల జాతీయ, ప్రజాస్వామిక ఆకాంక్షలను, వారి హక్కులను గౌరవింపబడతాయని, కాశ్మీర్ ప్రజలకు ప్రజాస్వామ్యం, శాంతితోపాటు మెరుగైన భవిష్యత్తు భారత్‌లో వుంటుందనే నమ్మకాన్ని కాశ్మీర్ ప్రజలలో కల్పించవలసిన బాధ్యత భారత ప్రభుత్వానిదయింది. కానీ కాశ్మీర్ ప్రజల హృదయాలను గెలుచుకోవటానికి బదులుగా భారత పాలకులు కాశ్మీర్ ప్రజల నాయకులను మోసపూరిత విధానాలతో వత్తిళ్ళతో, నిర్బంధాలతో అణచివేయజూశారు. కాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి విషయంలో భారత ప్రభుత్వం అనేక ఏకపక్ష, దొంగచాటు పద్ధతుల్ని అవలంబించింది. రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని పూర్తిగా పక్కకు పెట్టింది. కాశ్మీర్‌లో ఎన్నికలను, ప్రజాస్వామ్యాన్ని, ప్రభుత్వాలను ఏర్పాటు చేయటాన్ని, ప్రభుత్వాలను కూల్చటాన్ని ఒక ప్రహసనంగా మార్చివేసింది. ప్రత్యేకాధికారాలు కలిగిన సాయుధ దళాలు కొలువుతీరే ప్రదేశంగా, అణచివేత పద్ధతుల ప్రయోగశాలగా కాశ్మీర్‌ను మార్చివేశారు. నిరాశా నిస్పృహలకు లోనైన కొద్దిమంది యువకులు ఉగ్రవాదంవైపు మళ్ళగా, విశాల ప్రజాబాహుళ్యం, యువత తమ జీవనం కొరకు సంఘర్షణపడుతూ, తమ సమస్యల పరిష్కారానికి, పోలీసుల అకృత్యాలకు వ్యతిరేకంగా నిరసనోద్యమాలలో పాలుపంచు కుంటున్నారు. వీరంతా వివిధ పద్ధతుల్లో అణచివేతకు గురవుతున్నారు. అమాయక యువకులను ఉగ్రవాదులుగా ముద్రవేసి బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపటం భారత పాలకులకు ఒక విధానంగా మారింది.

కాంగ్రెసు ప్రభుత్వ అన్ని విధానాలను, చర్యలను బిజెపి ప్రభుత్వం నిశ్శబ్దంగాను, సంపూర్ణ మద్దతుతోను కొనసాగిస్తోంది. అదే సమయంలో దేశ సమగ్రతలో కాశ్మీర్‌ను భాగం చేసే విషయంలో తానే కఠినంగా వ్యవహ రిస్తున్నట్లు చూపించుకోవటానికి ఉబలాట పడుతోంది. కానీ అధికారపు రేసులో వున్న తర్వాత దానికుండే ఆచరణాత్మక ప్రతిబంధాలు దానికుంటాయి. 370 అధికరణాన్ని రద్దు చేయాలన్న వారిలో అది ముందుండవచ్చు కానీ దీనిని 2014 ఎన్డీఏ ఎజెండాగాగానీ, ఎన్డీయే ప్రభుత్వపు లక్ష్యంగాగానీ లేదు. బిజెపి ప్రతిపాదిత చర్యలకు కాశ్మీర్ ప్రజలనుండి, దేశంలోని ప్రజాస్వామిక శక్తుల నుండి ఆచరణలో ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుందన్నప్పుడు అది ఈ విషయంలో దృష్టి సారించింది. కాశ్మీర్‌లో బలమైన పునాదిని వేసుకోవాలంటే బిజెపి, పిడిపితో జట్టుకట్టక తప్పనిస్థితి దానికుంది. కానీ పిడిపి 370 అధికరణం రద్దును వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు కేంద్రంలో మరింత మెజారిటీతో అధికారంలోకి వచ్చాక తన ఎజెండాను అమలుపరచగలననుకుంటోంది బిజెపి. కానీ అది వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు.

కాశ్మీర్ ప్రజల జాతీయ, ప్రజాస్వామిక ఆకాంక్షలను గౌరవించటం, భారత పాలకులు కాశ్మీర్ ప్రజలకు చేసిన హామీలను గౌరవించి శాంతియుత, ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించటం, ఆ పరిస్థితుల్లో కాశ్మీర్ ప్రజలు తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకోవటం అన్నవి కాశ్మీర్ విషయంలో కాంగ్రెసువికానీ, బిజెపివికానీ విధానాలు కానే కావు. కాశ్మీర్ విషయంలో రెండు పార్టీలకు మౌలికమైన తేడాలేమీ లేవు. వారి గొడవ అంతా కాశ్మీర్ ప్రజలను వంచించటంలో, అక్కడ లేని శత్రువుతో యుద్ధం చేయటంలో ఎవరు దృఢంగా వున్నారు, ఎవరు తెలివిగా వ్యవహ రిస్తున్నారు అనేదే. కాశ్మీర్ ప్రజలు ఇదంతా అర్థంచేసుకోగలరు, ఒక పెద్ద కఠినమైన దీర్ఘకాలిక పోరాటం చేయాల్సి వుంది.

oooo